ఉత్తరం
TG TEL/25/A1234 www.kakatiyanews.com
# కాకతీయ
మంగళవారం, 01 సెప్టెంబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 18 | పేజీలు: 6 వెల: 5




# కాశిబుగ్గలో కలెక్షన్ రాజ్యం!

- అక్రమ నిర్మాణాలే టార్గెట్‌గా వసూళ్ల ఆరోపణలు
- డీసీ ప్రసన్నరాణి తీరుపై ఉద్యోగ వర్గాల్లో చర్చ
- సర్వే నంబర్ వివాదంతో మరింత ముదిరిన ఆరోపణలు
- డీసీ ప్రసన్నరాణిపై విచారణ ఎప్పుడో?

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) కాశిబుగ్గ సర్కిల్‌లో 'కలెక్షన్' వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. సర్కిల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలను అడ్డం పెట్టుకుని వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణికి అనుకూలంగా వ్యవహరించే కొందరు ఉద్యోగులు అక్రమ నిర్మాణాల వద్దకు వెళ్లి డబ్బులు వసూలు చేస్తున్నారనే ప్రచారం బల్దియా ఉద్యోగ వర్గాల్లో సాగుతోంది. రోజువారీగా వసూలైన మొత్తాలు మధ్యాహ్న సమయానికే కార్యాలయానికి చేరుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

**కాశిబుగ్గ కేంద్రంగా 'కలెక్షన్'?**

ప్రసన్నరాణి కాశిబుగ్గ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సర్కిల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలు, అనుమతులు లేకుండా చేపడుతున్న పనులను కొందరు ఉద్యోగులు గుర్తించి.. సంబంధిత యజమానులతో సంప్రదింపులు జరుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో డీసీకి అనుకూలంగా ఉన్న నలుగురు ఉద్యోగులు కీలకంగా వ్యవహరిస్తున్నారనే చర్చ జరుగుతోంది. అక్రమ నిర్మాణాల వద్దకు వెళ్లి నయానో.. భయానో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు

........(తరువాయి 2లో)



# ఎల్‌నినో దెబ్బ

## తెలంగాణలో తీవ్ర వర్షా భావం

### ఆగస్టులో 38 శాతం లోటు..
### 3 నెలల్లో 17 శాతం తక్కువ వర్షం

- గతేడాదితో పోలిస్తే ఏకంగా 64 శాతం తగ్గిన వర్షపాతం
- మధ్య, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో తీవ్ర వర్షా భావం
- హైదరాబాద్ పరిధిలోనూ సాధారణం కంటే 22 శాతం తక్కువ
- బంగాళాఖాతంలోని వాతావరణ వ్యవస్థల ప్రభావం అంతంతే
- సెప్టెంబరు వర్షా లపైనే రైతుల ఆశలు

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** ఎల్‌నినో ప్రభావం తెలంగాణను వెంటాడుతోంది. వర్షాకాలంలో కీలకమైన ఆగస్టు నెలలోనే వానలు ముఖం చాటేయడంతో రాష్ట్రం తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లోకి జారుకుంది. సాధారణంగా ఈ నెలలో కురవాల్సిన వర్షంలో భారీ లోటు ఏర్పడింది. గతేడాదితో పోలిస్తే ఈసారి ఆగస్టులో నమోదైన వర్షపాతం ఏకంగా 64 శాతం తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది. జూన్ నుంచి ఆగస్టు వరకు మూడు నెలల కాలంలోనూ సాధారణ వర్షపాతం కంటే 17 శాతం తక్కువ వర్షం నమోదైంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ వ్యవస్థలు తెలంగాణపై ఆశించిన స్థాయిలో ప్రభావం చూపకపోవడం, ఎల్‌నినో ప్రభావం కొనసాగడం వర్షాభావానికి ప్రధాన కారణాలుగా వాతావరణ శాఖ పేర్కొంది. తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ గణాంకాల ప్రకారం.. ఆగస్టులో రాష్ట్రంలో సాధారణంగా 215.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, ఈసారి కేవలం 134.5 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. దీంతో నెలవారీ వర్షపాత లోటు 38 శాతంగా నమోదైంది. వర్షాకాలం ప్రారంభమైన జూన్‌లో 12 శాతం లోటు నమోదుకాగా, జులైలో కేవలం 1 శాతం లోటు మాత్రమే ఉంది. అయితే ఆగస్టులో మాత్రం పరిస్థితి ఒక్కసారిగా దిగజారింది. గతేడాది ఆగస్టుతో పోలిస్తే ఈసారి వర్షాభావం మరింత స్పష్టంగా కనిపించింది. 2025 ఆగస్టులో రాష్ట్రవ్యాప్తంగా 378.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 2026 ఆగస్టులో మాత్రం 134.5 మిల్లీమీటర్ల వర్షమే కురిసింది. అంటే గతేడాదితో పోలిస్తే దాదాపు 64 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. వర్షాకాలంలో కొంతకాలం

........(తరువాయి 2లో)



## ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఐవీఎఫ్
# సేవలు విస్తరిస్తాం
### జిల్లాలకూ దశలవారీగా విస్తరణ

- నిబంధనలు ఉల్లంఘించే సెంటర్లపై కఠిన చర్యలు
- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

3

## కమిటీలతో ప్రభుత్వ పనితీరు మరింత సమర్థం



2

- ప్రజాధనం దుబారా కాకుండా పర్యవేక్షించాలి
- నిర్మాణాత్మక సూచనలతో ప్రభుత్వానికి దిశానిర్దేశం చేయాలి
- శాసన పరిషత్ ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

## 23,757 జీడీఎస్ పోస్టులతో నోటిఫికేషన్

- నేటి నుంచే వన్‌టైమ్ రిజిస్ట్రేషన్
- తెలంగాణ, ఏపీలోనూ భారీగా పోస్టులు
- సెప్టెంబర్ 2 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు
- 10వ తరగతి అర్హత..! రాత పరీక్ష, ఇంటర్వ్యూ లేకుండానే ఎంపిక
- పదో తరగతి మార్కుల ఆధారంగా మెరిట్




3

## రక్షణ రంగంలో ఎఫ్‌డీఐకి
# రెడ్‌కార్పెట్?

- 74 శాతం పరిమితిపై సడలింపుల దిశగా కేంద్రం అడుగులు
- విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు పరిశ్రమలతో సంప్రదింపులు
- రక్షణ తయారీకి భారీగా పెరిగిన బడ్జెట్ కేటాయింపులు
- ఎగుమతుల్లో రికార్డు వృద్ధి.. ప్రైవేట్ కంపెనీల వాటా గణనీయం
- 2029 నాటికి రూ.3 లక్షల కోట్ల ఉత్పత్తి లక్ష్యం
- రూ.50 వేల కోట్ల రక్షణ ఎగుమతులే కేంద్రం టార్గెట్

2





## భూయజమానికి చట్టబద్ధ హక్కు

- ప్రతి అంగుళం భూమికి శాస్త్రీయ సర్వే
- భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం
- నవంబర్ నాటికి తొలి విడత భూ రీ-సర్వే పూర్తి చేయాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి
- లైసెన్స్‌డ్ సర్వేయర్లు విధులకు రాకపోతే చర్యలు
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

5



## రైల్వే ప్రాజెక్టుల పనులు
# వేగవంతం చేయాలి

- పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలి
- సమన్వయంతో నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి
- సీఎస్ సంజయ్ జాజు

3

## ప్రణాళికతోనే హైదరాబాద్
# అభివృద్ధి



### విద్య, ఉపాధి అవకాశాలకు నగరం ఆశ్రయం

- రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నాం
- సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులకు ప్రాధాన్యం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- అంబర్‌పేట-మూసారాంబాగ్ మధ్య మూసీ నదిపై హైలెవల్ బ్రిడ్జి ప్రారంభోత్సవం



**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** విద్య, ఉపాధి అవకాశాలకు హైదరాబాద్ ఆశ్రయంగా నిలిచిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అన్ని పరిశ్రమలు హైదరాబాద్‌కు రావడం వల్లే నగరం అభివృద్ధి చెందుతోందని తెలిపారు. రాష్ట్రంలో మౌలిక వసతులను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని, రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని చెప్పారు. అంబర్‌పేట-మూసారాంబాగ్ మధ్య మూసీ నదిపై నిర్మించిన హైలెవల్ బ్రిడ్జిని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం అంబర్‌పేటలోని స్పోర్ట్స్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రూ.52 కోట్ల వ్యయంతో 400 మీటర్ల పొడవున నిర్మించిన ఈ వంతెన అందుబాటులోకి రావడంతో చాదర్‌ఘాట్ వంతెనపై ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్నవారు అంబర్‌పేటలో వంతెన ఎందుకు నిర్మించలేదని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే హైలెవల్ బ్రిడ్జిని నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో అంబర్‌పేటలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించారా అని ప్రశ్నించారు.

........(తరువాయి 2లో)

## ఎమ్మెల్సీ రహమత్ బేగ్
# మిస్సింగ్!

- ఎంఐఎం నుంచి బహిష్కరణ.. రాజీనామాకు ఆదేశం
- ఆరోపణలను ఖండించిన రహమత్ బేగ్
- డీప్‌ఫేక్ వీడియోలతో తనను అప్రతిష్ఠపాలు చేస్తున్నారని ఆరోపణ
- హైదరాబాద్ చేరుకున్న తర్వాత కనిపించకుండా పోయినట్లు ప్రచారం



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపిన ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్ వ్యవహారం మరో మలుపు తిరిగింది. పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఆయన.. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయబోనని స్పష్టం చేసిన నేపథ్యంలో హైదరాబాద్ చేరుకున్న అనంతరం కనిపించకుండా పోయినట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఆగస్టు 29న రహమత్ బేగ్‌ను ఎంఐఎం పార్టీ నుంచి తక్షణమే బహిష్కరిస్తున్నట్లు పార్టీ జాయింట్ సెక్రటరీ ఎస్.ఏ. హుస్సేన్ అన్వర్ ప్రకటించారు. ఎమ్మెల్సీ పదవికి కూడా వెంటనే రాజీనామా చేసి శాసనమండలి చైర్మన్‌కు సమర్పించాలని ఆదేశించారు. అయితే బహిష్కరణకు గల కారణాన్ని పార్టీ అధికారిక ప్రకటనలో వెల్లడించలేదు. రహమత్ బేగ్‌పై సోషల్ మీడియాలో తీవ్ర ఆరోపణలు వైరల్ కావడంతో ఈ వ్యవహారం రాజకీయంగా దుమారం రేపింది. ఓ మైనర్ బాలికకు సంబంధించిన లైంగిక వేధింపుల ఆరోపణలు తనపై వస్తున్నాయని పేర్కొంటూ వాటిని రహమత్ బేగ్ తీవ్రంగా ఖండించినట్లు సమాచారం. తాను ఎలాంటి తప్పు చేయలేదని ఆయన స్పష్టం చేశారు. తన ప్రతిష్ఠను దెబ్బతీయడానికి కొందరు సాంకేతికతను దుర్వినియోగం చేసి డీప్‌ఫేక్ వీడియోలు, మార్ఫింగ్

........(తరువాయి 2లో)

# రక్షణ రంగంలో ఎఫ్‌డీఐకి రెడ్‌కార్పెట్?

**కాకతీయ, నేషనల్ డెస్క్ :** దేశ రక్షణ తయారీ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు అంతర్జాతీయ సంస్థలను భారత్‌లోకి ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులపై దృష్టి సారించింది. రక్షణ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలను మరింత సడలించే అంశాన్ని పరిశీలిస్తోంది. ప్రస్తుతం 74 శాతం వరకు విదేశీ పెట్టుబడులకు ఆటోమేటిక్ మార్గంలో అనుమతి ఉండగా, అంతకుమించిన పెట్టుబడులకు కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా ఉంది. ఈ పరిమితులను సడలించడం ద్వారా రక్షణ తయారీ రంగంలోకి మరిన్ని అంతర్జాతీయ సంస్థలను తీసుకురావాలన్న ఆలోచనతో కేంద్రం ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా పరిశ్రమల భాగస్వాములతో సంబంధిత శాఖలు సంప్రదింపులు జరుపుతున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం ప్రకారం రక్షణ రంగంలో 74 శాతం వరకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ఆటోమేటిక్ రూట్‌లో అనుమతి ఉంది. అంతకుమించి పెట్టుబడులు పెట్టాలంటే ప్రభుత్వ అనుమతి పొందాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం భారత్‌కు అందే అవకాశం ఉన్న పెట్టుబడులకు ఈ మార్గంలో అనుమతులు కల్పిస్తున్నారు. అయితే ఇతర కీలక తయారీ రంగాలతో పోలిస్తే రక్షణ రంగంలోకి వస్తున్న విదేశీ పెట్టుబడుల పరిమాణం ఇంకా తక్కువగానే ఉండటంతో నిబంధనలను మరింత సరళీకరించే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోంది.

**పెట్టుబడులకు మరింత వెసులుబాటు**

రక్షణ రంగంలోకి విదేశీ పెట్టుబడులను పెంచేందుకు ఏయే నిబంధనలను సడలించాలి, ఏ విధానంలో పెట్టుబడులకు మరింత వెసులుబాటు కల్పించాలి అనే అంశాలపై సంబంధిత పరిశ్రమల ప్రతినిధులతో చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం విదేశీ పెట్టుబడులకు హోం మంత్రిత్వ శాఖ నుంచి భద్రతా అనుమతులు అవసరం. రక్షణ మంత్రిత్వ శాఖ నిర్దేశించే మార్గదర్శకాలను కూడా పాటించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను సులభతరం చేయడంతోపాటు పెట్టుబడిదారులకు మరింత స్పష్టత కల్పించే మార్పులపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. రక్షణ తయారీ రంగంలో అంతర్జాతీయ సంస్థలు నేరుగా తయారీ యూనిట్లు ఏర్పాటు చేయడం, భారతీయ సంస్థలతో సాంకేతిక భాగస్వామ్యాలు కుదుర్చుకోవడం, సంయుక్త భాగస్వామ్య సంస్థలు ఏర్పాటు చేయడం వంటి అవకాశాలు పెంచేందుకు ఎఫ్‌డీఐ విధానంలో మార్పులు ఉపయోగపడతాయని కేంద్రం భావిస్తోంది. దీనివల్ల విదేశీ పెట్టుబడులతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం, తయారీ సామర్థ్యం భారత్‌కు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దేశీయంగా రక్షణ ఉత్పత్తుల తయారీని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు చేపట్టింది. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాల్లో భాగంగా రక్షణ రంగానికి బడ్జెట్ కేటాయింపులను గణనీయంగా పెంచింది. 2013 14లో రూ.2.53 లక్షల కోట్లుగా ఉన్న రక్షణ రంగ బడ్జెట్ 202627 నాటికి రూ.7.85 లక్షల కోట్లకు చేరుకుంది. రక్షణ రంగంలో ప్రభుత్వ వ్యయం పెరగడంతో దేశీయ తయారీ సామర్థ్యాన్ని విస్తరించేందుకు కూడా అవకాశాలు పెరిగాయి.

**భారీ లక్ష్యాల దిశగా అడుగులు**

రక్షణ తయారీ, ఎగుమతులను మరింత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించింది. 2029 నాటికి దేశంలో ఏటా రూ.3 లక్షల కోట్ల విలువైన రక్షణ ఉత్పత్తులను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అదే సమయంలో రక్షణ ఉత్పత్తుల ఎగుమతులను రూ.50 వేల కోట్లకు పెంచాలని నిర్దేశించుకుంది. ఈ రెండు లక్ష్యాలను చేరుకోవాలంటే దేశీయ తయారీ సామర్థ్యాన్ని విస్తరించడంతోపాటు భారీ పెట్టుబడులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రైవేట్ రంగ భాగస్వామ్యం అవసరం కానుంది. ఈ నేపథ్యంలో ఎఫ్‌డీఐ నిబంధనల సడలింపుపై కేంద్రం కసరత్తు ప్రాధాన్యం సంతరించుకుంది. విదేశీ సంస్థలకు భారత్‌లో తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశం పెరిగితే పెట్టుబడుల ప్రవాహం వేగవంతం కావచ్చు. అంతర్జాతీయ కంపెనీలు భారతీయ సంస్థలతో కలిసి సంయుక్త ప్రాజెక్టులు చేపట్టడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేయడం, దేశీయంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం వంటి పరిణామాలకు మార్గం సుగమం కావచ్చు. మరోవైపు రక్షణ రంగంలో పెట్టుబడులు పెరగడం వల్ల ఉపాధి అవకాశాలు కూడా పెరిగే అవకాశం ఉంది. తయారీ యూనిట్ల ఏర్పాటుతో ప్రత్యక్ష ఉపాధితోపాటు అనుబంధ పరిశ్రమలకు కూడా ఊతం లభించనుంది. రక్షణ పరికరాల తయారీలో దేశీయ సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం భారత్ రక్షణ ఉత్పత్తుల తయారీని కేవలం దేశీయ అవసరాలకే పరిమితం చేయకుండా అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ చేసే స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. రక్షణ బడ్జెట్ పెంపు, దేశీయ తయారీకి ప్రోత్సాహం, ప్రైవేట్ రంగ భాగస్వామ్యం, ఎగుమతుల పెరుగుదలతో ఇప్పటికే ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. ఇప్పుడు విదేశీ పెట్టుబడుల నిబంధనలను మరింత సడలిస్తే ఈ రంగంలోకి అంతర్జాతీయ మూలధనం, సాంకేతికత మరింతగా ప్రవేశించే అవకాశం ఉంటుంది. దీంతో 2029 నాటికి నిర్దేశించిన భారీ ఉత్పత్తి, ఎగుమతి లక్ష్యాలను చేరుకునేందుకు భారత్‌కు మరింత బలం చేకూరే అవకాశం ఉంది.

### ఎగుమతుల్లో భారీ దూకుడు

దేశీయ రక్షణ ఉత్పత్తుల తయారీ పెరగడంతో ఎగుమతుల్లోనూ గణనీయమైన వృద్ధి నమోదైంది. 201314 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి రక్షణ ఉత్పత్తుల ఎగుమతుల విలువ రూ.686 కోట్లుగా ఉండేది. 202526 నాటికి అది రూ.38,424 కోట్లకు చేరింది. అంటే దశాబ్ద కాలంలో రక్షణ ఎగుమతులు భారీగా పెరిగాయి. దేశీయ సంస్థలు తయారు చేస్తున్న రక్షణ పరికరాలు, వ్యవస్థలకు అంతర్జాతీయ మార్కెట్లలో ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ఈ రంగాన్ని మరింత విస్తరించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. 202526లో రక్షణ ఎగుమతుల్లో ప్రైవేట్ రంగ సంస్థల పాత్ర కూడా గణనీయంగా కనిపించింది. మొత్తం ఎగుమతుల్లో ప్రైవేట్ కంపెనీల వాటా 45.16 శాతంగా ఉంది. వీటి ఎగుమతుల విలువ రూ.17,353 కోట్లుగా నమోదైంది. రక్షణ రంగ ప్రభుత్వ సంస్థల వాటా 54.84 శాతంగా ఉండగా, వాటి ఎగుమతుల విలువ రూ.21,071 కోట్లుగా ఉంది. ప్రభుత్వ రంగంతోపాటు ప్రైవేట్ రంగం కూడా రక్షణ తయారీ, ఎగుమతుల్లో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో విదేశీ సంస్థల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా ఈ సామర్థ్యాన్ని మరింత విస్తరించాలని కేంద్రం భావిస్తోంది. ఇప్పటికే దేశీయ రక్షణ తయారీ రంగంలో ప్రైవేట్ కంపెనీల పెట్టుబడులు, సాంకేతిక సామర్థ్యం పెరుగుతున్నాయి. విదేశీ సంస్థలతో సాంకేతిక భాగస్వామ్యాలు ఏర్పడితే దేశీయ కంపెనీల సామర్థ్యం మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా అత్యాధునిక రక్షణ వ్యవస్థలు, పరికరాలు, సాంకేతికతల తయారీలో భారత్ మరింత స్వయం సమృద్ధి సాధించేందుకు ఇది దోహదపడుతుందని భావిస్తున్నారు.

# ప్రణాళికతోనే హైదరాబాద్ అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించినా పేదలకు ఇవ్వకుండా దళారులకు ఇచ్చారని ఆరోపించారు. 'తెలంగాణ రైజింగ్ విజన్-2047' పాలసీని తీసుకొచ్చామని సీఎం తెలిపారు. మూసీ వరదల్లో ప్రజలు ఇబ్బందులు పడినా గత ప్రభుత్వం ఎలాంటి సహాయం చేయలేదని ఆరోపించారు. హైదరాబాద్ అభివృద్ధిలో భాగంగా మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

**రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపణ**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్ల పాలనలో రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసిందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర అప్పును రూ.70 వేల కోట్ల నుంచి రూ.8.10 లక్షల కోట్లకు తీసుకెళ్లారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు ప్రస్తుతం నెలకు రూ.7 వేల కోట్ల వరకు వడ్డీలు చెల్లిస్తున్నామని చెప్పారు. రిటైర్ అయిన ఉద్యోగుల బకాయిలు రూ.8 వేల కోట్లు పెండింగ్‌లో పెట్టిపోయారని ఆరోపించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు. ఆర్టీసీ, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ వస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించినందుకు ఆర్టీసీకి ఇప్పటివరకు రూ.11 వేల కోట్లు చెల్లించామని వివరించారు. ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులను కూడా కొనసాగిస్తున్నామని సీఎం పేర్కొన్నారు.

**బతుకమ్మకుంటను ఆక్రమణల నుంచి కాపాడాం**

అంబర్‌పేటలో పది ఎకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదలకు అందిస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు చెరువు లేకుండా బతుక



మ్మకుంటను ఆక్రమించారని ఆరోపించారు. ఆక్రమణలను తొలగించి బతుకమ్మకుంటను తిరిగి ఆడబిడ్డలకు బహుమతిగా ఇచ్చామని చెప్పారు. బతుకమ్మకుంటను తిరిగి ఆక్రమించేందుకు సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి కుట్రలు చేస్తున్నారని సీఎం ఆరోపించారు. బతుకమ్మకుంటను ఆక్రమించిన సుధాకర్‌రెడ్డి వెనుక ఎవరున్నారో ఆలోచించాలని ప్రజలను కోరారు. చెరువుల్లో ఆక్రమణలను తొలగిస్తున్నామే తప్ప తాము చెరువుల్లో విల్లాలు, ఫామ్‌హౌస్‌లు నిర్మించుకోవడం లేదని స్పష్టం చేశారు. వెయ్యి రోజుల పాలనలో రైతుల కోసం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామని రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో అప్పులేని రైతులు ఉన్నారని నీతి ఆయోగ్ చెప్పిందని పేర్కొన్నారు. బతుకమ్మ చీరల విషయంలోనూ బీఆర్ఎస్ నేతలు కమీషన్లు తిన్నారని ఆరోపించారు. మహిళలను ఆర్టీసీ అద్దె బస్సులకు యజమానులుగా చేశామని, మహిళలు తయారు చేసిన వస్తువులను అమెజాన్ ద్వారా విక్రయించుకునే అవకాశం కల్పించామని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3.48 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో ఏడాదిలోపు లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లు నిర్మించి ఆడబిడ్డలకు అందించనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. సంక్షేమ పథకాలతో పాటు నగరానికి అవసరమైన రహదారులు, వంతెనలు, తాగునీరు, ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేస్తూ హైదరాబాద్‌ను మరింత మెరుగైన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.



# ఎల్‌నినో దెబ్బ..

(మొదటిపేజీ తరువాయి)

పొడివాతావరణం తర్వాత భారీ వర్షాలు కురవడం సాధారణమే అయినప్పటికీ, ఈసారి ఆగస్టులో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో వర్షాభావ పరిస్థితులు తీవ్రమయ్యాయి.

**నెలంతా తీవ్ర హెచ్చుతగ్గులు**

ఆగస్టు నెలలో వర్షపాతం తీవ్ర అస్థిరతకు లోనైంది. నెల ప్రారంభంలోనే లోటు 40 శాతానికి పైగా ఉండగా, ఆగస్టు 3 నాటికి అది 49 శాతానికి చేరుకుంది. ఆ తర్వాత కురిసిన వర్షాలతో ఆగస్టు 4 నాటికి రాష్ట్రం 13 శాతం మిగులు వర్షపాతం నమోదైన స్థితికి చేరింది. కానీ ఈ ఊరట ఎక్కువకాలం నిలవలేదు. ఆగస్టు 5 నాటికి మళ్లీ 2 శాతం లోటులోకి వెళ్లిన రాష్ట్రం, ఆ తర్వాత క్రమంగా మరింత వెనుకబడింది. ఆగస్టు 22 నాటికి వర్షపాత లోటు 39 శాతానికి చేరగా, నెలాఖరుకు 38 శాతం లోటుతో ఆగస్టు ముగిసింది. బంగాళాఖాతంలో ఆగస్టులో మొత్తం మూడు వాతావరణ వ్యవస్థలు ఏర్పడినా తెలంగాణకు పెద్దగా ప్రయోజనం కలగలేదు. అవన్నీ వాయువ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉత్తర ఒడిశా, దాని పరిసర ప్రాంతాల మీదుగా పయనించాయి. తెలంగాణ ఈ వ్యవస్థల ప్రభావ పరిధి అంచుల్లో ఉండటంతో విస్తారంగా వర్షాలు కురిసే పరిస్థితి ఏర్పడలేదు. ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసినా, మధ్య, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది.

**మూడు నెలల్లోనూ లోటే**

జూన్ నుంచి ఆగస్టు వరకు మూడు నెలల కాలంలో రాష్ట్రంలో సాధారణంగా 573.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉంది. కానీ ఈసారి 473.8 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయ్యాయి. దీంతో మూడు నెలల వర్షపాత లోటు 17 శాతంగా ఉంది. జూన్, జులైలో పరిస్థితి కొంతమేర సాధారణంగానే కనిపించినా, ఆగస్టులో వర్షాలు భారీగా తగ్గిపోవడంతో మొత్తం వర్షాకాల లోటు పెరిగింది. వర్షాభావ ప్రభావం గ్రామీణ ప్రాంతాలకే పరిమితం కాలేదు. పట్టణ ప్రాంతాల్లోనూ సాధారణ వర్షపాతానికి, నమోదైన వర్షపాతానికి మధ్య భారీ వ్యత్యాసం కనిపించింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జూన్ నుంచి ఆగస్టు మధ్య సాధారణంగా 459.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉంది. అయితే 359.6 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో ఈ ప్రాంతాల్లో 22 శాతం లోటు నమోదైంది. ఆగస్టు వర్షాభావం వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో సెప్టెంబరు వర్షాలు అత్యంత కీలకంగా మారాయి. ఇప్పటికే వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఆగస్టు తీవ్ర నిరాశ మిగిల్చింది. తక్కువ వర్షపాతం కారణంగా సాగునీటి లభ్యత, పంటల పరిస్థితి, జలాశయాల్లోకి వచ్చే నీటి ప్రవాహం వంటి అంశాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. వర్షాలు కురవాల్సిన సమయంలో పొడివాతావరణం కొనసాగడంతో భూగర్భ జలాలపైనా ప్రభావం చూపే పరిస్థితి ఏర్పడుతోంది. మొత్తంగా వర్షాకాలంలో కీలకమైన ఆగస్టు నెల తెలంగాణకు తీవ్ర నిరాశనే మిగిల్చింది. ఎల్‌నినో ప్రభావం, బంగాళాఖాతంలోని వాతావరణ వ్యవస్థలు తెలంగాణ వైపు బలంగా కదలకపోవడం కలిసి వర్షపాతాన్ని దెబ్బతీశాయి. ఆగస్టు నెలలో 38 శాతం లోటు, జూన్ నుంచి ఆగస్టు వరకు 17 శాతం లోటు నమోదవడం పరిస్థితి తీవ్రతను చాటుతోంది. మరోవైపు గతేడాదితో పోలిస్తే ఆగస్టులో ఏకంగా 64 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ఇక మిగిలిన వర్షాకాలంలో సెప్టెంబరు వర్షాలు ఏ మేరకు కురుస్తాయన్నదే తెలంగాణ వ్యవసాయ రంగానికి కీలకంగా మారింది.

# ఎమ్మెల్సీ రహమత్ బేగ్ మిస్సింగ్!

(మొదటిపేజీ తరువాయి)

చేసిన ఫొటోలను ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై పోలీసులు లేదా ఎంఐఎం నుంచి పూర్తి వివరాలు బహిర్గతం కాలేదు.

**సైబర్ క్రైమ్‌ను ఆశ్రయించిన బేగ్**

డీప్‌ఫేక్ వీడియోలు, మార్ఫింగ్ ఫొటోల పేరుతో తనను బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని రహమత్ బేగ్ హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. గుర్తు తెలియని వ్యక్తులు తనకు ఫోన్ చేసి డబ్బులు ఇవ్వకపోతే తనపై తప్పుడు ప్రచారం చేస్తామని బెదిరించారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నట్లు వార్తలు వచ్చాయి. ఈ ఫిర్యాదు నేపథ్యంలోనే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు నిజమైనవా, మార్ఫింగ్ చేసినవా అన్నది కూడా దర్యాప్తులో తేలాల్సి ఉంది.

**ఉమ్రా నుంచి హైదరాబాద్‌కు..**

తనపై వస్తున్న ప్రచారంలో నిజం లేదని చెబుతున్న రహమత్ బేగ్.. తాను ఎక్కడికీ పారిపోలేదని, ఉమ్రా యాత్ర కోసం మక్కా వెళ్లానని గతంలో స్పష్టం చేశారు. ఆగస్టు 29న ఆయన హైదరాబాద్‌కు తిరిగి వచ్చినట్లు సమాచారం. అయితే నగరానికి చేరుకున్న తర్వాత ఆయన ఆచూకీపై స్పష్టత లేకపోవడంతో మిస్సింగ్ అంశం తెరపైకి వచ్చింది. ఆయన ఎక్కడ ఉన్నారన్నది ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ నుంచి బహిష్కరించినప్పటికీ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాల్సిన అవసరం లేదని రహమత్ బేగ్ స్పష్టం చేశారు. ఎంఐఎం తనను పార్టీ నుంచి తొలగించిందని, అందువల్ల శాసనమండలి సభ్యత్వం నుంచి తప్పుకోవాల్సిన అవసరం లేదని ఆయన వాదిస్తున్నారు. మరోవైపు పార్టీ మాత్రం వెంటనే రాజీనామా చేయాలని ఆదేశించింది. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వద్ద రహమత్ బేగ్ రాజీనామా సమర్పించలేదని కూడా సమాచారం వెలువడింది.

**ఎంఐఎం నిర్ణయం వెనుక అసలు కారణమేంటి?**

రహమత్ బేగ్‌ను పార్టీ నుంచి ఎందుకు బహిష్కరించారన్న దానిపై అధికారికంగా ఎంఐఎం స్పష్టత ఇవ్వలేదు. అయితే వీడియో వివాదం, ఆయనపై వచ్చిన ఆరోపణలు, పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన అంశాల నేపథ్యంలోనే ఈ చర్య జరిగిందనే ప్రచారం రాజకీయ వర్గాల్లో సాగుతోంది. కొన్ని నివేదికలు మహిళ ఇంట్లోకి మారువేషంలో ప్రవేశించినట్లు వచ్చిన ఆరోపణలను ప్రస్తావించాయి. అయితే ఈ ఆరోపణలు కూడా నిర్ధారిత వాస్తవాలుగా చెప్పలేని పరిస్థితి ఉంది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు రహమత్ బేగ్‌పై వచ్చిన తీవ్రమైన ఆరోపణలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ నుంచి బహిష్కరించడం మాత్రమే సరిపోదని, ఆరోపణల వెనుక వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేశారు. మరోవైపు రహమత్ బేగ్ మాత్రం తనపై జరుగుతున్న ప్రచారమంతా తప్పుడు సమాచారమని, డీప్‌ఫేక్ సాంకేతికతను ఉపయోగించి తనను అప్రతిష్ఠపాలు చేస్తున్నారని చెబుతున్నారు.

**అసలు నిజం తేలాల్సిందే..**

రహమత్ బేగ్ వ్యవహారంలో ప్రస్తుతం మూడు అంశాలు కీలకంగా మారాయి. ఆయనపై వచ్చిన ఆరోపణలు వాస్తవమా? సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు నిజమైనవా, డీప్‌ఫేక్ లేదా మార్ఫింగ్ చేసినవా? ఎంఐఎం పార్టీ బహిష్కరణకు అసలు కారణమేంటి? అన్నది స్పష్టత రావాల్సి ఉంది. అదే సమయంలో హైదరాబాద్ చేరుకున్న తర్వాత ఆయన ఆచూకీపై వస్తున్న వార్తలపైనా స్పష్టత అవసరమవుతోంది. ఆరోపణలు, ఖండనలు, రాజకీయ నిర్ణయాల మధ్య అసలు వాస్తవాలను దర్యాప్తు సంస్థలు తేల్చాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# కమిటీలతో ప్రభుత్వ పనితీరు మరింత సమర్థం

- శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** సభల్లో అన్ని అంశాలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశం ఉండకపోవచ్చని, అలాంటి అంశాలను లోతుగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నిర్మాణాత్మక సూచనలు చేయడంలో కమిటీలు కీలక పాత్ర పోషించాలని శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ప్రజల సంక్షేమం, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలు, ప్రజాధనం సద్వినియోగంపై కమిటీలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. శాసన పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన శాసన మండలి కమిటీల ప్రారంభ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన కమిటీల చైర్మన్లు, సభ్యులకు శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, కార్యదర్శులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ శాఖలకు కేటాయిస్తున్న నిధులు సక్రమంగా, లక్ష్యాలకు అనుగుణంగా వినియోగమవుతున్నాయా అనే అంశాన్ని అంచనాల కమిటీ పరిశీలించాలని గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణ కమిటీ అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత పాటించాలని, భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. సౌకర్యాల కమిటీ ప్రజాప్రతినిధులకు అవసరమైన మౌలిక వసతులను ఎప్పటికప్పుడు పరిశీలించి మెరుగైన సౌకర్యాలు కల్పించేలా కృషి చేయాలన్నారు. గ్రంథాలయ కమిటీ చట్టాలు, నివేదికలు, పరిశోధన పత్రాలను సభ్యులకు సులభంగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రజాధనం దుబారా కాకుండా ప్రతి శాఖ నుంచి సమాచారాన్ని తెప్పించుకుని క్షుణ్ణంగా పరిశీలించి తగిన సూచనలు చేయాలని శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. వన్యప్రాణులు, అడవులు, జల వనరులు, గాలి, పర్యావరణ సమతుల్యత పరిరక్షణకు కమిటీ కృషి చేయాలని సూచించారు. శాసనమండలి గ్రంథాలయం జ్ఞాన కేంద్రంగా పనిచేస్తుందని, సభ్యులు గత చర్చలు, రికార్డులను అధ్యయనం చేసుకోవాలని అన్నారు. మాజీ సభ్యుల వైద్యం, పెన్షన్ సౌకర్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అంచనాల కమిటీ చైర్మన్ కోరం కనకయ్య, సభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, పి. రాకేశ్‌రెడ్డి, యాదవ్‌రెడ్డి, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణ కమిటీ సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి, అనీల్ జాదవ్, సౌకర్యాల కమిటీ సభ్యులు మేడిపల్లి సత్యం, యల్ రమణ, ప్రకాష్‌గౌడ్, నెల్లికంటి సత్యం, బండారి లక్ష్మారెడ్డి, గ్రంథాలయ కమిటీ చైర్మన్ మట్టా రాగమయి, సభ్యులు పల్వాయి హరీష్‌బాబు, జుల్ఫికర్ అలీ, దేశపతి శ్రీనివాస్, సిహెచ్ అంజిరెడ్డి, బొగ్గారపు దయానంద్, శాసన పరిషత్ కార్యదర్శి డాక్టర్ వి. నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి పాల్గొన్నారు.

# కాశిబుగ్గలో 'కలెక్షన్' రాజ్యం!

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగ వర్గాల్లో వినిపిస్తున్నాయి. వసూళ్ల అనంతరం నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కాశిబుగ్గ సర్కిల్‌లో జరుగుతున్న వసూళ్ల వ్యవహారంపై బల్దియా ఉద్యోగుల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ఉదయం నుంచి వివిధ ప్రాంతాల్లో తిరిగే ఉద్యోగులు వసూలు చేసిన మొత్తాన్ని మధ్యాహ్నానికి కార్యాలయానికి తీసుకువస్తారని.. ఆ తర్వాత ఆ డబ్బును డీసీ తన వెంట తీసుకెళ్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఇప్పటివరకు అధికారిక ఆధారాలు బహిర్గతం కాలేదు. ఆరోపణలు నిజమా? కాదా? తేల్చేందుకు సర్కిల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదులు, జారీ చేసిన నోటీసులు, తీసుకున్న చర్యలు, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అధికారులు పరిశీలించాల్సి ఉంది. ముఖ్యంగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై నోటీసులు ఇచ్చిన తర్వాత ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ఎన్ని నిర్మాణాలు నిలిపివేశారు? ఎన్ని కూల్చివేశారు? ఎన్ని నిర్మాణాలు కొనసాగుతున్నాయి? అనే వివరాలను పరిశీలిస్తే ఆరోపణల్లో వాస్తవమెంతో తేలే అవకాశం ఉంది. చర్యలు తీసుకున్నట్లు రికార్డుల్లో చూపిస్తూ క్షేత్రస్థాయిలో నిర్మాణాలు కొనసాగుతున్నాయా? అనే అంశంపైనా విచారణ జరగాల్సి ఉంది.

**సర్వే నంబర్ వివాదంతో మరిన్ని అనుమానాలు**

ఇటీవల కాశిబుగ్గ సర్కిల్ పరిధిలో చోటుచేసుకున్న సర్వే నంబర్ మార్పు వ్యవహారం కూడా డీసీ ప్రసన్నరాణి తీరుపై అనుమానాలకు తావిచ్చింది. ఒకరి ఆధీనంలో ఉన్న స్థలానికి సంబంధించిన సర్వే నంబర్‌ను మరో వ్యక్తికి సంబంధించినదిగా పేర్కొంటూ ఇంటి నంబర్ వ్యవహారంలో నిర్ణయం తీసుకున్నారనే ఆరోపణలు ఇప్పటికే వెలువడ్డాయి. బాధితులు గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. గతంలో అధికారులు స్థలాన్ని పరిశీలించి ఒక సర్వే నంబర్ సరైనదని, మరో సర్వే నంబర్ తప్పని తేల్చినట్లు బాధితులు చెబుతున్నారు. అయినప్పటికీ తాజాగా భిన్నమైన నిర్ణయం ఎలా వచ్చిందన్నది ఇప్పుడు ప్రశ్నగా మారింది. ఒకరి స్థలానికి సంబంధించిన రికార్డుల్లో మార్పులు ఎలా చోటుచేసుకున్నాయి? ఇంటి నంబర్ కేటాయింపు సమయంలో ఏ పత్రాలను పరిశీలించారు? గతంలో రద్దు చేసిన ఇంటి నంబర్‌ను తిరిగి ఎలా పరిగణనలోకి తీసుకున్నారు? అనే అంశాలపై సమగ్ర విచారణ అవసరమవుతోంది.

**'అది 624.. 527గా ఎలా మారింది?'**

ఈ వివాదంలో ఏడీ స్థాయి సర్వే నిర్వహించి స్థలం సర్వే నంబర్ 624/1/2కు సంబంధించినదిగా తేల్చినట్లు బాధితులు పేర్కొంటున్నారు. ఈ మేరకు ఈ నెల 14న సర్వే నివేదిక ఇచ్చినట్లు చెబుతున్నారు. ఇంతకుముందు కూడా ఇదే స్థలానికి సంబంధించి అధికారులు విచారణ జరిపి 624/1/2 సరైన సర్వే నంబర్‌గా, 527/బి తప్పుగా గుర్తించినట్లు బాధితుల వాదన. అయితే ఇప్పుడు అదే స్థలాన్ని 527/బిగా పేర్కొంటూ నిర్ణయం ఎలా తీసుకున్నారన్నదే ప్రధాన ప్రశ్నగా మారింది. సర్వే నంబర్ మార్పునకు ఆధారమైన పత్రాలు ఏమిటి? ఆ మార్పును ఎవరు ప్రతిపాదించారు? ఎవరు ఆమోదించారు? ఏ అధికారి సంతకం చేశారు? అనే వివరాలను బయటపెట్టాల్సిన అవసరం ఉంది. ఈ రికార్డులన్నింటినీ పరిశీలిస్తే అసలు సర్వే నంబర్ ఏదో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

**సర్వే అధికారిపై ఒత్తిడి తెచ్చారా?**

ఈ వివాదంలో ఏడీ సర్వే అనంతరం సర్వే అధికారిపై ఒత్తిడి తెచ్చినట్లు కూడా బల్దియా వర్గాల్లో ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వే కారణంగా డీసీ ఉద్యోగానికి ఇబ్బంది వస్తుందంటూ సదరు అధికారితో వ్యాఖ్యలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ధ్రువీకరణ లేదు. స్థలం తమదేనని భావిస్తే సర్వే ఫలితాలను చట్టపరంగా సవాలు చేసే అవకాశం ఉన్నప్పటికీ.. సర్వే అధికారిపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు ఎందుకు జరిగాయన్నదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అసలు సర్వే నివేదికలో ఏముంది? దాని ఆధారంగా తదుపరి చర్యలు ఎందుకు తీసుకోలేదు? అనే అంశాలను అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది. బల్దియాలో అవినీతి, అక్రమాలకు సంబంధించిన ఆరోపణలు కొత్తేమీ కాదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వివిధ సందర్భాల్లో ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, ప్రజలు ఫిర్యాదులు చేసినప్పటికీ వాటిపై పూర్తిస్థాయిలో విచారణ జరగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఏకంగా కమిషనర్ సంతకం ఫోర్జరీ చేసిన వ్యవహారంలోనూ చర్యల విషయంలో జాప్యం జరిగిందనే విమర్శలు వినిపించాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారిపై అవినీతి, అక్రమాలకు సంబంధించిన ఆరోపణలు రావడం బల్దియా ఉన్నతాధికారులకు సవాల్‌గా మారింది. చిన్నస్థాయి ఉద్యోగులపై చర్యలు తీసుకోవడంలోనూ వెనుకడుగు వేస్తున్నారనే విమర్శల మధ్య.. ఉన్నతస్థాయి అధికారిపై వచ్చిన ఆరోపణలను ఎంత సీరియస్‌గా తీసుకుంటారన్నదే ప్రశ్నగా మారింది.

**ఆరోపణలు నిజమా.. నిరాధారమా?**

డీసీ ప్రసన్నరాణిపై వస్తున్న ఆరోపణలు నిజమా? లేక వ్యక్తిగత వివాదాల నేపథ్యంలో చేస్తున్నవా? అనేది విచారణతో తేలాల్సి ఉంది. కాశిబుగ్గ సర్కిల్‌లో గత కొంతకాలంగా అక్రమ నిర్మాణాలపై జారీ చేసిన నోటీసులు, తీసుకున్న చర్యలు, పెండింగ్ ఫైళ్లు, ఇంటి నంబర్ల కేటాయింపులు, సర్వే నంబర్ మార్పులకు సంబంధించిన రికార్డులను ఉన్నతాధికారులు పరిశీలిస్తే అసలు విషయం బయటపడే అవకాశం ఉంది. అలాగే సర్వే నంబర్ 624/1/2, 527/బికి సంబంధించిన పాత, ప్రస్తుత రెవెన్యూ రికార్డులు.. ఇంటి నంబర్ కేటాయింపు ఫైళ్లు.. సర్వే నివేదికలు.. అధికారుల ఉత్తర్వులను బహిరంగంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిరాధారమైతే సంబంధిత అధికారులు స్పష్టమైన ఆధారాలతో వాటిని ఖండించాలి. ఆరోపణల్లో వాస్తవం ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. బల్దియా పాలనపై ప్రజల్లో నమ్మకం నిలబెట్టాలంటే.. అధికారులపై వచ్చే ఆరోపణలకు సమాధానం రికార్డులతోనే ఇవ్వాలి. కాశిబుగ్గలో సాగుతున్న 'కలెక్షన్' ఆరోపణలతో పాటు సర్వే నంబర్ వివాదంపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

# కాంగ్రెస్ హామీలపై బీఆర్ఎస్ సమరభేరి





- హుస్నాబాద్‌లో వారం రోజుల పాటు వినూత్న నిరసనలు
- బాకీ కార్డులతో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతాం
- మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్

కాకతీయ, హుస్నాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని, ప్రతి హామీకి లెక్క చెప్పేలా ప్రభుత్వాన్ని నిలదీస్తామని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ అన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు గ్రామ గ్రామాన పర్యటించి కాంగ్రెస్ హామీల వైఫల్యాలను ప్రజల ముందు ఎండగడతాయని తెలిపారు. సెప్టెంబరు 2 నుంచి వారం రోజుల పాటు హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రతి మండలం, మున్సిపాలిటీ, గ్రామం, వార్డులో చేపట్టనున్న కార్యక్రమాలపై ముఖ్య నాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, వెయ్యి రోజులు పూర్తవుతున్నా అనేక హామీలు అమలుకు నోచుకోలేదని సతీష్‌కుమార్ విమర్శించారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, విద్యార్థులు, వృద్ధులు, పేదలు, కార్మికులు, కౌలు రైతులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీల అమలుపై ప్రజలకు లెక్క చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా ప్రజలకు గుర్తు చేసేందుకు బాకీ కార్డుల ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు. గ్రామాలు, వార్డుల్లో ప్రజా అవగాహన కార్యక్రమాలు, నిరసనలు, హామీలపై చర్చలు చేపడతామన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రజలతో కలిసి స్థానికంగా పోరాటాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రజలు కాంగ్రెస్ హామీలను మర్చిపోలేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీకి ప్రభుత్వం లెక్క చెప్పాల్సిందేనని అన్నారు. మండల, గ్రామ, పట్టణ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన, మహిళా, విద్యార్థి విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని వారం రోజుల కార్యక్రమాలను ప్రజా ఉద్యమంగా మలచాలని వొడితల సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు.

## భూభారతితో 50 లక్షల మందికి ఇబ్బందులు

### 22ఏ గందరగోళంపై శ్వేతపత్రం విడుదల చేయాలి
### భూముల వ్యవహారంపై న్యాయ విచారణ జరపాలి
### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు

కాకతీయ, సిద్దిపేట : కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో రైతులు, భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు అన్నారు. భూభారతి కంటే ధరణే మెరుగని, 22ఏ నిషేధిత జాబితా గందరగోళంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 50 లక్షల మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. భూముల వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేసి, సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 22ఏ నిషేధిత జాబితా వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను నిరసిస్తూ సిద్దిపేటలో సోమవారం ఎంపీ రఘునందన్‌రావుతో కలిసి నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా, కౌలు రైతులకు రైతుబంధు వంటి హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను గాలికొదిలేసిందని విమర్శించారు. రాష్ట్రంలో అత్యధిక ఆత్మహత్యలు కౌలు రైతులవేనని అన్నారు. సాధారణ రైతులు తమ భూమిని అమ్ముకోలేక, బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణం పొందలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వం ధరణి పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే, ప్రస్తుత ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి మరింత దారుణంగా మారిందని రామచందర్‌రావు విమర్శించారు. మల్కాజ్‌గిరి, చేవెళ్ల, సిద్దిపేట వంటి ప్రాంతాల్లో లక్షలాది ఎకరాలు, ప్లాట్లు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. పిల్లల చదువులు, ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం భూములు విక్రయించుకోలేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. తప్పు జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్వయంగా అంగీకరించారని, తప్పును సరిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. గతంలో కేసీఆర్ కుటుంబం, ఇప్పుడు రేవంత్‌రెడ్డి కుటుంబం పేర్లు మారినా ప్రజల సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదని విమర్శించారు.

## 23,757 జీడీఎస్ పోస్టులతో నోటిఫికేషన్

- నేటి నుంచే వన్‌టైమ్ రిజిస్ట్రేషన్
- తెలంగాణ, ఏపీలోనూ భారీగా పోస్టులు
- సెప్టెంబర్ 2 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు
- 10వ తరగతి అర్హత..! రాత పరీక్ష, ఇంటర్వ్యూ లేకుండానే ఎంపిక
- పదో తరగతి మార్కుల ఆధారంగా మెరిట్

కాకతీయ, తెలంగాణ బ్యూరో : ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఇండియా పోస్ట్ శుభవార్త అందించింది. తపాలా శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ డాక్ సేవక్ రిక్రూట్‌మెంట్–2026కు సంబంధించి వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా మొత్తం 23,757 జీడీఎస్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ (బీపీఎం), అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ (ఏబీపీఎం), డాక్ సేవక్ పోస్టులు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోనూ గణనీయ సంఖ్యలో పోస్టులు ఉన్నట్లు వెల్లడించారు. ఇండియా పోస్ట్ అధికారిక జీడీఎస్ పోర్టల్‌లో వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ సెప్టెంబర్ 19, 2026 సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది. ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణ, ఫీజు చెల్లింపు ప్రక్రియ సెప్టెంబర్ 2 నుంచి ప్రారంభం కానుంది. దరఖాస్తుల సమర్పణకు సెప్టెంబర్ 21, 2026 సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఉంటుంది. దరఖాస్తుల్లో తప్పులు ఉంటే సరిచేసుకునేందుకు సెప్టెంబర్ 23, 24 తేదీల్లో ఎడిట్ /కరెక్షన్ విండో అందుబాటులో ఉంటుంది.

### పదో తరగతి అర్హత ఉంటే చాలు..

జీడీఎస్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పదో తరగతిలో మ్యాథ్స్, ఇంగ్లిష్‌లో పాస్ మార్కులు సాధించి ఉండాలి. దరఖాస్తు చేస్తున్న పోస్టుకు సంబంధించిన స్థానిక భాషను కనీసం పదో తరగతి వరకు చదివి ఉండటం తప్పనిసరి. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీలకు నిబంధనల ప్రకారం గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పదేళ్ల వరకు వయో సడలింపు ఉంది. జనరల్ కేటగిరీ అభ్యర్థులు దరఖాస్తు ఫీజుగా రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ట్రాన్స్‌వుమెన్ అభ్యర్థులకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది. ఫీజును క్రెడిట్ /డెబిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్, యూపీఐ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. ఈ రిక్రూట్‌మెంట్‌లో ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన అంశం రాత పరీక్ష, ఇంటర్వ్యూ లేకపోవడం. అభ్యర్థులు పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా సిస్టమ్ జనరేటెడ్ మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. దాని ఆధారంగానే అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. మెరిట్ లిస్ట్ తయారీలో మార్కులను 4 డెసిమల్ పాయింట్ల వరకు పరిగణనలోకి తీసుకుంటారు.

## రైల్వే ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి



### పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలి
### సమన్వయంతో నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి
### సీఎస్ సంజయ్ జాజు

కాకతీయ,తెలంగాణ బ్యూరో : రాష్ట్రంలో పురోగతిలో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించి పనులను నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రైల్వే కనెక్టివిటీ రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక, ప్రాంతీయ అభివృద్ధికి అత్యంత కీలకమని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సోమవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్‌రాజ్, నవీన్‌మిట్టల్, ఇతర ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్ష నిర్వహించారు. రైల్వే ప్రాజెక్టుల పురోగతి, భూసేకరణ, పరిపాలనా అనుమతులు, అమలులో ఎదురవుతున్న సమస్యలు, రాష్ట్ర ప్రభుత్వం అందించాల్సిన సహాయ సహకారాలపై చర్చించారు. సుమారు రూ.50,870 కోట్ల అంచనా వ్యయంతో 17 రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి 2,023 కిలోమీటర్ల మేర విస్తరణకు సంబంధించిన డీపీఆర్‌లను రైల్వే బోర్డుకు సమర్పించినట్లు అధికారులు వివరించారు. పెండింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ సూచించారు. రైల్వే అండర్‌పాస్‌లు, ఓవర్‌బ్రిడ్జిలు, అప్రోచ్ రోడ్లు, రోడ్ల విస్తరణ, రైల్వే మార్గాల డబ్లింగ్, చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు ప్రజా రవాణా సదుపాయాల మెరుగుదల తదితర అంశాలను సమీక్షించారు. సంబంధిత శాఖల అధికారులు, దక్షిణ మధ్య రైల్వే అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి సమస్యలకు పరిష్కారాలు గుర్తించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఫ్యూచర్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు పరిధిలో రైల్వే లైన్ల విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. మున్సిపల్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు, రెవెన్యూ, విద్యుత్, రోడ్లు–భవనాల శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. పీఎం గతిశక్తి కింద నిధులు పొందేందుకు సమగ్ర డీపీఆర్‌లు సిద్ధం చేయాలని సూచించారు. ఎంఎంటీఎస్ విస్తరణ, ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు పరిధిలో టెర్మినల్స్, భవిష్యత్ రైల్వే కనెక్టివిటీ, బుల్లెట్ ట్రైన్ మార్గాలకు అవసరమైన భూసేకరణపై కూడా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, మేడ్చల్–మల్కాజిగిరి కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, సిటీ పోలీస్ జాయింట్ కమిషనర్ ట్రాఫిక్ జోయెల్ డేవిస్, వివిధ జిల్లాల కలెక్టర్లు, దక్షిణ మధ్య రైల్వే అధికారులు పాల్గొన్నారు.

## ఆరేపల్లి చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్




### సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుల గుర్తింపు
### ఏనుమాముల సీఐ జవాజీ సురేష్

కాకతీయ, వరంగల్ ప్రతినిధి : ఆరేపల్లి గ్రామంలో జరిగిన చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏనుమాముల సీఐ జవాజీ సురేష్ తెలిపారు. గత వారం ఆరేపల్లికి చెందిన ఏదులాపురం మంజు ఇంటికి తాళం వేసి కిరాణా షాపు విక్రయానికి వెళ్లారని తెలిపారు. రాత్రి షాపు వద్దే నిద్రించి, తెల్లవారుజామున ఇంటికి వచ్చే సరికి తాళం పగలగొట్టి ఉండటాన్ని గుర్తించారన్నారు. ఇంట్లోని బీరువా తాళం పగలగొట్టి 15 గ్రాముల బంగారు నల్లపూసల తాడు, రూ.10 వేల నగదు అపహరించినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. సోమవారం మధ్యాహ్నం ఎస్ఐ గోవర్ధన్ సిబ్బందితో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఆటోలో అనుమానంగా వెళ్తున్న ఇద్దరిని వెంబడించి పట్టుకున్నారని సీఐ తెలిపారు. విచారణలో వారు నేరాన్ని అంగీకరించారని పేర్కొన్నారు. ఎంహెచ్ నగర్‌కు చెందిన ఊరడి అభిలాష్, ఇసెంపల్లి లోకేష్‌గా నిందితులను గుర్తించామన్నారు. జల్సాలు, తాగుడుకు అలవాటుపడి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జవాజీ సురేష్ తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ గోవర్ధన్, సిబ్బందిని ఆయన అభినందించారు.

## ఫంక్షన్ హాల్ పనులు పూర్తి చేయాలి

### దళితుల సమస్యలపై ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపాలి
### దళిత సంఘాల నాయకుల డిమాండ్



కాకతీయ, శంకరపట్నం: కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని అరుంధతి ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వివిధ గ్రామాలకు చెందిన దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అరుంధతి ఫంక్షన్ హాల్ వద్ద దళిత సంఘాల నాయకులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఎమ్మెల్యేగా గెలిచి వెయ్యి రోజులు పూర్తికావస్తున్నా దళితుల సమస్యలపై తగినంతగా దృష్టి సారించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల కోసం నిర్మిస్తున్న అరుంధతి ఫంక్షన్ హాల్ పనులు ఇంకా పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

### దళిత సంక్షేమంపై దృష్టి సారించాలి

ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించాలని కోరారు. ప్రభుత్వం దళితుల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళితుల సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దళిత సంఘాల నాయకులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఐదేళ్లుగా పశు బీమా క్లెయిమ్ పెండింగ్

### శ్రీనిధి అధికారుల చుట్టూ రైతు ప్రదక్షిణలు
### రైతు బొంగు మల్లేశం ఆవేదన

కాకతీయ, గంభీరావుపేట : ఐదేళ్లుగా పశు బీమా క్లెయిమ్ పరిష్కరించకపోవడంతో శ్రీనిధి అధికారుల నిర్లక్ష్యం తనకు ప్రాణ సంకటంగా మారిందని నర్మాల గ్రామానికి చెందిన రైతు బొంగు మల్లేశం ఆవేదన వ్యక్తం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ఫిర్యాదు చేశారు. 2018లో శ్రీనిధి ద్వారా రూ.54,900 రుణం తీసుకున్నానని, పశు బీమా, సభ్యురాలి బీమా కోసం రూ.3,375, రూ.1,525 చెల్లించానని తెలిపారు. రుణం మంజూరు సమయంలో సీఏ, సీసీ, ఏపీఎం, శ్రీనిధి మేనేజర్, ఆర్ఎంలు పశువు మృతి చెందితే రుణం మాఫీ అవుతుందని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. 2021లో పశువు మృతి చెందగా, ధ్రువపత్రాలు, ఫొటోలు, ట్యాగ్ నంబర్ తదితర వివరాలను అధికారులకు సమర్పించినా ఇప్పటివరకు క్లెయిమ్ పరిష్కరించలేదన్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగినా నిర్లక్ష్యపు సమాధానాలతో కాలయాపన చేస్తున్నారని, ధ్రువపత్రాలు సక్రమంగా లేవంటూ అధికారులు చెబుతున్నారని వాపోయారు. క్లెయిమ్ పరిష్కరిస్తామని చెప్పి రుణ మొత్తాన్ని బలవంతంగా వసూలు చేశారని ఆరోపించారు. టార్గెట్ల కోసం అవసరం లేకపోయినా రుణం అంటగట్టి, బీమా ప్రయోజనం అందించలేదన్నారు. సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఐవీఎఫ్ సేవలు విస్తరిస్తాం

### జిల్లాలకూ దశలవారీగా విస్తరణ
### నిబంధనలు ఉల్లంఘించే సెంటర్లపై కఠిన చర్యలు
### ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

కాకతీయ,తెలంగాణ బ్యూరో : ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలను మరింత విస్తరించడంతో పాటు ప్రైవేట్ ఫర్టిలిటీ సెంటర్లలో ఏఆర్‌టీ, సరోగసి చట్టాల అమలును కట్టుదిట్టం చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే సెంటర్లపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో ప్రభుత్వ, ప్రైవేట్ ఫర్టిలిటీ, ఐవీఎఫ్ సెంటర్ల పనితీరు, ఏఆర్‌టీ, సరోగసి చట్టాల అమలు, పీసీపీఎన్‌డీటీ చట్టంపై మంత్రి సమీక్షించారు. గాంధీ ఆస్పత్రి, పేట్లబుర్జు ఆస్పత్రుల్లోని ప్రభుత్వ ఐవీఎఫ్ సెంటర్ల పనితీరును సమీక్షించారు. ఈ రెండు కేంద్రాల్లో ఇప్పటివరకు 39,802 మంది పేషెంట్లకు ఫర్టిలిటీ వైద్య సేవలు అందించగా, 20,185 ఫాలిక్యులర్ స్టడీలు, 521 ఐయూఐ ప్రక్రియలు, 545 ఐవీఎఫ్ కేసులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో 2024 అక్టోబరులో, పేట్లబుర్జులోని ఎంజీఎంహెచ్‌లో 2024 డిసెంబరులో ఐవీఎఫ్ కేంద్రాలను ప్రారంభించినట్లు అధికారులు వివరించారు. రెండు కేంద్రాల సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు జిల్లాల్లో దశలవారీగా ఐవీఎఫ్ సేవలు విస్తరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో 477 ఏఆర్‌టీ, సరోగసి సెంటర్లు రిజిస్టర్ అయి ఉన్నాయని అధికారులు తెలిపారు. వీటిలో 129 ఏఆర్‌టీ లెవల్–1, 226 ఏఆర్‌టీ లెవల్–2, 59 ఏఆర్‌టీ బ్యాంకులు, 63 సరోగసి క్లినిక్‌లు ఉన్నట్లు వివరించారు. సెంటర్లలో సిబ్బంది వివరాలు, రిజిస్ట్రేషన్, రికార్డుల నిర్వహణ, గ్రీవెన్స్ సెల్ తదితర అంశాలను నిరంతరం తనిఖీ చేయాలని మంత్రి సూచించారు. 379 ప్రైవేట్ ఫర్టిలిటీ సెంటర్లను తనిఖీ చేయగా 50 సెంటర్లలో డీవియేషన్స్ గుర్తించినట్లు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యానారాయణ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన 2 సెంటర్ల రిజిస్ట్రేషన్లు రద్దు చేయగా, 9 సెంటర్ల అనుమతులను తాత్కాలికంగా రద్దు చేసినట్లు వెల్లడించారు. పేషెంట్లపై అనవసర ఆర్థిక భారం మోపకుండా పారదర్శకంగా సేవలు అందించాలని మంత్రి ఆదేశించారు. పీసీపీఎన్‌డీటీ చట్టం అమలులో భాగంగా ఏప్రిల్ నుంచి జూలై వరకు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో 2,600 తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. 52 సెంటర్లలో డీవియేషన్స్ గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు వివరించారు. లింగ నిర్ధారణకు పాల్పడే కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యానారాయణ, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవిందర్ నాయక్, ఐవీఎఫ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుమిత్ర, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు..

## అగ్రిస్టాక్ అమలులో తెలంగాణకు మరో ప్రోత్సాహకం

### తొలి మైలురాయికి రూ.175 కోట్ల ప్రోత్సాహకం
### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కాకతీయ,తెలంగాణ బ్యూరో : అగ్రిస్టాక్ ఆధారిత ఎరువుల పంపిణీ వ్యవస్థలో తొలి మైలురాయిని పూర్తి చేసినందుకు తెలంగాణకు రూ.175 కోట్ల ప్రోత్సాహక నిధులు మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ 31.08.2026న జారీ చేసిన లేఖలో తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనను పరిశీలించి, నిర్దేశించిన ప్రమాణాలు, నిబంధనలను రాష్ట్రం పూర్తి చేసిందని పేర్కొందన్నారు. దీంతో ఎస్ఏఎస్‌సీఐ 2026–27లో భాగంగా రూ.175 కోట్ల ప్రోత్సాహకానికి రాష్ట్రం అర్హత సాధించిందని తెలిపారు.

# వరంగల్ అభివృద్ధిపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు చర్చకు రావాలి

- పదేళ్ల పాలన.. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనపై ప్రజలే బేరీజు వేసుకోవాలి
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీరు, ఎయిర్‌పోర్ట్‌కు నిధులు తీసుకొచ్చాం
- కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, రింగ్‌రోడ్డు పనులను ముందుకు తీసుకెళ్తున్నాం
- గుండు అరవింద్ వరంగల్ వస్తే ఉన్న గుండు కొట్టిస్తా
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



కాకతీయ, వరంగల్ బ్యూరో : వరంగల్ అభివృద్ధిపై విమర్శలు చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ నేతలు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేంద ర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, గత పదేళ్లలో బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. హనుమకొండ డీసీసీ భవన్‌లో సోమవారం ఆయన మీడి యాతో మాట్లాడారు. విషయం లేని ఆరో పణలు, ఆధారాలు లేని విమర్శలతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరని నాయిని రాజేం దర్‌రెడ్డి అన్నారు. గత పదేళ్లలో వరంగల్‌కు బీజేపీ, బీఆర్ఎస్ ఏం చేశాయో, కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో ఏం చేసిందో ప్రజలే బేరీజు వేసుకోవాలని సూచించారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్ర మే ప్రజల్లోకి వచ్చే సీజనల్ రాజకీయ నాయకులను నమ్మవద్దని కోరారు. గత పదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోజరుగుతున్న అభివృద్ధిని ప్రజల ముందే చర్చించి తేల్చుకుందామని బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. బీజేపీ నేత గుండు అరవింద్‌పై ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో స్పందించారు. ''గుండు అరవింద్.. నీవు వరంగల్ వస్తే ఉన్న గుండు కొట్టిస్తా'' అంటూఘాటు వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధిపై మాట్లాడే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని హితవు పలికారు.

### అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటికి భారీ నిధులు

వరంగల్ నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కోసం సుమారు రూ.5,300 కోట్లు తీసుకొచ్చామని నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. శాశ్వత తాగునీటి వసతుల కోసం రూ.550 కోట్లకు పైగా నిధులతో పనులు చేపడుతున్నామని చెప్పారు. నిజాం కాలం నాటి ఫిల్టర్ బెడ్ల స్థానంలో ఆధునిక ఫిల్టర్ బెడ్లను ఏర్పాటు చేస్తున్నామని, పాత నీటి పైప్‌లైన్ల సామర్థ్యాన్ని పెంచి నగర ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు అనుమతులు తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణ కోసం సుమారు రూ.300 కోట్లు కేటాయించి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లామని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఎయిర్‌పోర్ట్ విషయంలో ఏం చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

### రింగ్‌రోడ్డు, కోచ్ ఫ్యాక్టరీ పనులకు వేగం

వరంగల్ రింగ్‌రోడ్డుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాల అభివృద్ధికి రూ.25 కోట్లు తీసుకొచ్చామని, పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి కూడా నిధులు సమకూర్చామని చెప్పారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కోసం భూసేకరణ చేపట్టి, విభజన చట్టంలో ఇచ్చిన హామీకి మళ్లీ జీవం పోశామని పేర్కొన్నారు. వరంగల్ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తి సహకారం అందిస్తున్నారని తెలిపారు. తాను కోరుతున్న అభివృద్ధి పనుల విషయంలో ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తున్నారని చెప్పారు. ఉద్యోగులు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.

### సంక్షేమంపై రాజకీయాలు చేయొద్దు

ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై బీజేపీ నేతలు రాజకీయాలు చేయడం సిగ్గుచేటని నాయిని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీవంటి ప్రజా సంక్షేమ పథకాలను తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. కులం,మతం, పార్టీ అనే తేడా లేకుండా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ విధానమని స్పష్టం చేశారు. వరంగల్ ప్రజలు గత పదేళ్ల పాలనను, కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధిని పోల్చి చూసి నిర్ణయం తీసుకోవాలని కోరారు. అభివృద్ధిని అడ్డుకునే రాజకీయాలనుప్రజలు తిరస్కరించాలనినాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు.

# నాడు ఉత్తములు.. నేడు అవినీతిపరులు!

- ప్రశంసా పత్రాల జారీపై పెరుగుతున్న ప్రశ్నలు
- ఏసీబీ కేసుల్లో చిక్కిన అధికారులపై ములుగు జిల్లాలో చర్చ
- జయరాజు, పాణిని, తస్లీమా వ్యవహారాలపై
- అవార్డుల ఎంపికలో నామ్ కే వాస్తేగా పరిశీలన





కాకతీయ, ములుగు ప్రతినిధి : ప్రభుత్వ విధుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను గుర్తించి స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల్లో ప్రశంసా పత్రాలు అందజేయడం ఆనవాయితీ. ప్రజలకు మెరుగైన సేవలందించిన వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఇచ్చే ఈ అవార్డులకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. అయితే ఒకప్పుడు 'ఉత్తమ ఉద్యోగులు'గా గుర్తింపు పొందిన కొందరి పేర్లు ఆ తర్వాత అవినీతి ఆరోపణలు, ఏసీబీ కేసుల్లో వినిపించడం ములుగు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. తాజాగా భూపాలపల్లి జిల్లా మైనింగ్ ఏడీగా పనిచేస్తున్న బొజ్జ జయరాజుపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ సోదాలు నిర్వహించడం ఈ అంశంపై మరోసారి చర్చకు తెరతీసింది. మైనింగ్ ఏడీ జయరాజు గతంలో ములుగు జిల్లాకు కూడా ఇన్‌చార్జి మైనింగ్ ఏడీగా బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల ఆయనకు ఉత్తమ అధికారిగా ప్రశంసా పత్రం అందిన కొద్దికాలానికే ఏసీబీ సోదాలు జరగడం అధికార వర్గాల్లో చర్చకు దారితీసింది. ఆగస్టు 27న జయరాజుతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులకు సంబంధించిన భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, హైదరాబాద్ ప్రాంతాల్లోని ఇళ్లు, కార్యాలయాల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. భూపాలపల్లి మైనింగ్ కార్యాలయంలోనూ రికార్డులను పరిశీలించారు. ఏసీబీ వెల్లడించిన వివరాల ప్రకారం రూ.3,06,53,177 విలువైన ఆస్తులను గుర్తించారు. ఇసుక రవాణా, ఇతర మైనింగ్ కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు వసూలు చేసి డ్రైవర్ ఖాతా ద్వారా మళ్లించినట్లు ఆరోపణలుఉండగా.. దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది.

### రూ.20 వేల లంచం కేసులో డీఈఓ

ములుగు జిల్లాలో గతంలో జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేసిన పాణిని వ్యవహారం కూడా ఇదే తరహాలో చర్చకు వచ్చింది. ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసా పత్రం అందుకున్న ఆయన.. 2025 జూన్ 16న ఓ ఉపాధ్యాయుడి రీపోస్టింగ్ వ్యవహారంలో రూ.20 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీకి ఫిర్యాదు అందింది. దీంతో నిర్వహించిన ట్రాప్‌లో డీఈఓ పాణిని, జూనియర్ అసిస్టెంట్ దిలీప్ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. పాణిని రూ.20 వేలు, దిలీప్ రూ.5 వేలు తీసుకున్నట్లు అప్పట్లో ఏసీబీ వెల్లడించింది. రీపోస్టింగ్ ఫైల్‌ను ముందుకు కదిలించేందుకు లంచం అడిగినట్లు పేర్కొంది. గతంలో ములుగు సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసిన మహమ్మద్ తస్లీమా పేరు కూడా ఇలాంటి సందర్భంలో ప్రస్తావనకు వచ్చింది. 2024 మార్చి 22న మహబూబాబాద్ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సమయంలో భూమి రిజిస్ట్రేషన్ కోసం లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఆమె నుంచి రూ.19,200 స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ తెలిపింది. నిర్వహించిన సోదాల్లో రూ.2.94 కోట్ల ప్రభుత్వ విలువైన ఆస్తులను గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఐదు ఇళ్లు, ఆరు ప్లాట్లు, సుమారు మూడు ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

### అసలు ఉత్తమ ఉద్యోగి ఎవరు?

ప్రశంసా పత్రం కేవలం ఓ సర్టిఫికెట్ మాత్రమే కాదు.. ప్రభుత్వ ఉద్యోగి పనితీరుకు ప్రజల ముందు ఇచ్చే గుర్తింపు. అలాంటి అవార్డులకు ఎంపిక చేసే ముందు సంబంధిత ఉద్యోగి పనితీరు, ప్రజలతో వ్యవహరించే తీరు, శాఖాపరమైన రికార్డు, గత ఆరోపణలు వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు ఉత్తమ అధికారులుగా గుర్తింపు.. మరోవైపు ఏసీబీ కేసులు, సోదాలు, లంచం ట్రాప్‌లు చోటు చేసుకోవడంతో అవార్డుల ఎంపిక ప్రక్రియపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎవరు సిఫారసు చేస్తున్నారు? ఏ ప్రాతిపదికన ఎంపిక చేస్తున్నారు? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. ఇలాంటిపరిస్థితులు పునరావృతం కాకుండా ఉత్తమ ఉద్యోగులఎంపికకుపారదర్శకప్రమాణాలురూపొందించాలని అంటున్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్యాలపై పోరుబాట

- సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు బీఆర్ఎస్ నిరసనలు
- వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పిలుపు




కాకతీయ, హనుమకొండ : కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. ఐనవోలు క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు కాంగ్రెస్ ఎన్నికల హామీలు, వాటి అమలులో వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. వెయ్యి రోజులు పూర్తవుతున్నా హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. కాంగ్రెస్ అసమర్థ పాలన, అబద్ధపు హామీలు, అన్ని వర్గాలకు జరిగిన అన్యాయాన్ని ప్రజల్లో ఎండగట్టేందుకు వివిధ రూపాల్లో నిరసనలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎస్ఐఆర్ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి మసూద్, మాజీ రైతుబంధు సమితి అధ్యక్షురాలు ఎల్లవుల లలిత యాదవ్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, మాజీ జడ్పీటీసీ మార్గం బిక్షపతి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు బండి రజని, తంపుల మోహన్, ఎర్రబెల్లి రాజేశ్వరరావు, తుళ్ల కుమార్, గోధుమల మధు, మాజీ డివిజన్ అధ్యక్షులు నరేడ్ల శ్రీధర్, నేరెళ్ల రాజు, కేతిరి రాజశేఖర్, జైపాల్, వినోద్, మాజీ కార్పొరేటర్ ఆవల రాధికా రెడ్డి, సిరంగి సునీల్, రాజు నాయక్‌తో పాటు నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి : ఎంఈవో శ్రీనివాస్



కాకతీయ, పెద్దవంగర : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని మండల విద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డులో గల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం ఇంగ్లీష్ డిపార్ట్మెంట్ వారు అందించిన బిలింగుయల్ పిక్టోరియాల్ డిక్షనరిలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెను ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఉపాధ్యాయులు సౌభాగ్య, రాజలింగం, పాషా, సదయ్య,అంజయ్య పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులు

- సెప్టెంబర్ 2 నుంచి 22 వరకు వివిధ సర్కిళ్లలో నిర్వహణ
- వినియోగదారులు నేరుగా ఫిర్యాదులు సమర్పించవచ్చు
- : ఫోరం చైర్‌పర్సన్ జి. నాగప్రసాద్

కాకతీయ, వరంగల్ బ్యూరో: విద్యుత్ వినియోగదారుల సమస్యలు, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలోని వివిధ సర్కిళ్లలో కంజ్యూమర్స్ గ్రీవియన్స్ రిడ్రెసల్ ఫోరం ఆధ్వర్యంలో లోకల్ కోర్టులు నిర్వహించనున్నట్లు ఫోరం చైర్‌పర్సన్ జి. నాగప్రసాద్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ కోర్టుల్లో వినియోగదారులు తమ సమస్యలను నేరుగా ఫోరం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందవచ్చని సూచించారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, విద్యుత్ మీటర్ల సమస్యలు, బిల్లుల్లో లోపాలు, కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరులో నిరాకరణ లేదా జాప్యం, సంస్థ అందించాల్సిన సేవల్లో ఆలస్యం తదితర అంశాలపై ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరిస్తామని తెలిపారు.

**లోకల్ కోర్టుల షెడ్యూల్**

**తేదీ సర్కిల్ వేదిక సంబంధిత ప్రాంతాలు**

1. సెప్టెంబర్ 2 జనగాం దేవరుప్పుల సబ్‌స్టేషన్ దేవరుప్పుల, సింగరాజుపల్లె, లింగాల ఘన్‌పూర్
2. సెప్టెంబర్ 8వరంగల్‌నల్లబెల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ నల్లబెల్లి, దుగ్గొండి, గిర్నిబావి, నర్సంపేట టౌన్
3. సెప్టెంబర్ 17మహబూబాబాద్‌మునగాలవీడు 33/11 కేవీ సబ్‌స్టేషన్ మునగాలవీడు, దంతాలపల్లి, నెల్లికుదురు
4. సెప్టెంబర్ 18 భద్రాద్రి కొత్తగూడెం దుమ్ముగూడెం 33/11 కేవీ సబ్‌స్టేషన్ దుమ్ముగూడెం, చర్ల
5. సెప్టెంబర్ 22 పెద్దపల్లి అంతేర్గం 33/11 కేవీ సబ్‌స్టేషన్ అంతేర్గం, బసంత్‌నగర్, పి.కె. రామయ్య కాలనీ (మేడిపల్లి–ఎన్‌టీపీసీ), రామగుండం (ఎన్‌టీపీసీ)
6. .నిర్దేశిత తేదీల్లో ఆయా ప్రాంతాల వినియోగదారులు లోకల్ కోర్టులకు హాజరై తమ విద్యుత్ సమస్యలు, ఫిర్యాదులను నేరుగా సమర్పించుకోవాలని టీజీఎన్‌పీడీసీఎల్ అధికారులు సూచించారు.

## శ్రీకృష్ణుడి బోధలు సమస్త లోకానికి అనుసరణీయం


- జెడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు
- జన్మాష్టమి వేడుకల పోస్టర్ ఆవిష్కరణ



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : శ్రీకృష్ణుడి బోధనలు సమస్త లోకానికి అనుసరణీయమైనవని, ఆయన అందించిన భగవద్గీత సర్వజీవులకు మార్గదర్శికగా నిలుస్తుందని ఉమ్మడి వరంగల్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు అన్నారు. సెప్టెంబర్ 4న శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఆచార్య ప్రభోదానంద యోగీశ్వరుల సౌజన్యంతో త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేడుకలకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను ఆదివారం హంటర్ రోడ్డులోని ది వీవర్స్ సొసైటీ భవన్‌లో సమ్మారావు ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు మాట్లాడుతూ.. సర్వమానవాళికి భగవద్గీత దిక్సూచిలాంటిదన్నారు. భగవద్గీతను అనుసరించిన వారికి మోక్షమార్గం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆధ్యాత్మిక జీవితంలో భగవద్గీతను ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 4న కాజీపేట పట్టణంలోని రైల్వే క్వార్టర్స్ వద్ద నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జమ్మికుంట శాఖ అధ్యక్షుడు వెంకటాచార్యులు, త్రైత సిద్ధాంతం ప్రతినిధులు చిప్ప సుధాకర్, రాజలింగం, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సంక్షేమ ఫలాలు సత్వరమే అందేలా కృషి

### పెద్దవంగర ఎంపీడీవోగా ఆరిఫ్ బాధ్యతల స్వీకరణ



కాకతీయ, పెద్దవంగర : ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సత్వరమే అందేలా కృషి చేస్తానని పెద్దవంగర మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆరిఫ్ తెలిపారు. పెద్దవంగర మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఆరిఫ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జిగా పనిచేసిన రమేష్ పదవీ విరమణ చేయడంతో ఆరిఫ్‌ను ప్రభుత్వం నియమించింది. ఇంతకుముందు ఆయన తొర్రూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధికారి గా పనిచేశారు. మండల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ, ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటానని ఆరిఫ్ తెలిపారు. కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీడీవోను కలిసి అభినందనలు తెలిపారు.

# భూయజమానికి చట్టబద్ధ హక్కు

- ప్రతి అంగుళం భూమికి శాస్త్రీయ సర్వే
- భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం
- నవంబర్ నాటికి తొలి విడత భూ రీ-సర్వే పూర్తి చేయాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి
- లైసెన్స్‌డ్ సర్వేయర్లు విధులకు రాకపోతే చర్యలు
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




కాకతీయ, వరంగల్ బ్యూరో : రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూయజమానికి చట్టబద్ధమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం మహబూబాబాద్ ఐడీఓసీ కార్యాలయంలో మంత్రి సీతక్కతో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో రెవెన్యూ, భూ రీ–సర్వే, రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా భూ రీ–సర్వేను వేగవంతం చేసి తొలి విడతను నవంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను లక్ష్యంగా ఎంపిక చేసి సర్వే చేపట్టాలని, వచ్చే ఏడాది మార్చి నాటికి రెండో విడతను పూర్తి చేయాలని సూచించారు. రాబోయే ఏడాదిన్నరలో రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని శాస్త్రీయంగా సర్వే చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 31 నాన్–కెడస్ట్రల్ గ్రామాల్లో 18 చోట్ల రీ–సర్వే ప్రారంభమైందని, ఐదు గ్రామాల్లో పూర్తయిందని అధికారులు తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో 8, జనగామ జిల్లాలో 5 గ్రామాల్లో వెంటనే సర్వే ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. నక్షా ఉన్న 70 కెడస్ట్రల్ గ్రామాల్లో 40 చోట్ల సర్వే కొనసాగుతోందని, ఏడు గ్రామాల్లో పూర్తయిందని తెలిపారు. ప్రభుత్వ రీ–సర్వే విధులకు హాజరుకాకుండా ప్రైవేట్ సర్వేలకు మాత్రమే పరిమితమయ్యే లైసెన్స్‌డ్ సర్వేయర్లకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయికి వెళ్లకుండా సర్టిఫికెట్లు జారీ చేస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు.

### 22-ఏ భూములపై నివేదిక.. ఇందిరమ్మ ఇళ్లకు వేగం

ప్రతి జిల్లాలో 22–ఏ భూముల వివరాలను సర్వే నంబర్ల వారీగా నాలుగు కాలమ్స్‌లో రూపొందించి రెండు రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పొరపాటున 22–ఏ జాబితాలో చేరిన అర్హులైన రైతుల భూములను పరిశీలించి జాబితా నుంచి తొలగించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. సాదా బైనామాలు, అటవీ–రెవెన్యూ భూముల సరిహద్దు వివాదాలను పరిష్కరించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం ఇప్పటివరకు సుమారు రూ.1,200 కోట్లు ఖర్చు చేసిందని మంత్రి తెలిపారు. జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో పురోగతి సంతృప్తికరంగా ఉండగా, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. భూపాలపల్లిలో 4,600 ఇళ్లు మంజూరు కాగా 854 మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. సెప్టెంబర్ 15 నాటికి గరిష్ఠ సంఖ్యలో ఇళ్లను పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 2,000 ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గుడిసెల్లో నివసించే అర్హులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రేకులు, తాత్కాలిక పైకప్పులతో ఉన్న అర్హులైన కుటుంబాలకు రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకం కింద ఆర్‌సీసీ స్లాబ్ నిర్మాణానికి రూ.2 లక్షల సహాయం అందించనున్నట్లు వెల్లడించారు.

### ఉచిత ఇసుకలో అక్రమ వసూళ్లు అరికట్టాలి

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచిత ఇసుక పేరుతో అదనపు రవాణా చార్జీలు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఐదు కిలోమీటర్ల పరిధిలోని క్వారీల నుంచి ట్రాక్టర్ ఇసుకకు రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రవాణా రేట్లను శాస్త్రీయంగా నిర్ణయించి సిస్టమ్‌లో నమోదు చేయాలని కలెక్టర్లకు సూచించారు. ఇళ్ల మంజూరు కోసం లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. రైతులు, పేదలకు ఇబ్బందులు లేకుండా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ పథకాల అమలులో అవినీతి, అక్రమాలు, నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. సమావేశంలో మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఎంపీలు పోరిక బలరామ్ నాయక్, డాక్టర్ కడియం కావ్య, ప్రభుత్వ విప్ జాటోత్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయని రాజేందర్ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు తదితర ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అశోక్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

**వైద్య ఆరోగ్య శాఖలో అంకితభావంతో సేవలు : డీఎంహెచ్ఓ డా. అప్పయ్య**



కాకతీయ, వరంగల్ : వైద్య ఆరోగ్య శాఖలో 41 సంవత్సరాలు అంకితభావంతో సేవలందించిన వేముల అశోక్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. అప్పయ్య అన్నారు. హనుమకొండ జిల్లా విస్తరణ, మీడియా అధికారిగా పనిచేసిన అశోక్‌రెడ్డి పదవీ విరమణ సందర్భంగా సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల్లో ఆరోగ్య అవగాహన కల్పించడంలో, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు ప్రచారం కల్పించడంలో ఆయన కీలకపాత్ర పోషించారని డా. అప్పయ్య కొనియాడారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జగన్మోహన్‌రావు మాట్లాడుతూ, వైద్య ఆరోగ్య శాఖతోపాటు టీజీఓ అసోసియేషన్‌కు అశోక్‌రెడ్డి సేవలందించారని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం, అవతరణ దినోత్సవాల సందర్భంగా శకటాల రూపకల్పనలో ఆయన సృజనాత్మకత అభినందనీయమన్నారు. జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఆకవరపు శ్రీనివాస్ కుమార్ ఆయన సేవలను కొనియాడారు. అశోక్‌రెడ్డిని ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డా. సిహెచ్ రాజారెడ్డి, డా. వెంకటరమణ, డా. మదన్‌మోహన్, డా. కృష్ణారావు, డా. రజిత, జయకుమార్, ఆకవరం శ్రీనివాస్, ప్రవీణ్, నవాజ్‌ఖాన్, కొప్పు ప్రసాద్, కిరణ్, శ్రీనివాస్, రామాంజనేయులు, నాగేశ్వరరావు, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

## కష్టకాలంలో కాంగ్రెస్ అండగా ఉంటుంది

**శాంతమ్మ కుటుంబానికి నేతల పరామర్శ**

**రాయపర్తి సర్పంచ్ గారె సహేంద్ర భిక్షపతి**



కాకతీయ, రాయపర్తి : శాంతమ్మ మృతి ఆ కుటుంబానికి తీరని లోటని, కష్టకాలంలో బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని రాయపర్తి సర్పంచ్ గారె సహేంద్ర బిక్షపతి, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మండల కేంద్రానికి చెందిన పరకాల శాంతమ్మ సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె నివాసానికి చేరుకున్న కాంగ్రెస్ నాయకులు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. శాంతమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మచ్చ రమేష్, చెవ్వు కాశీనాథం, బొమ్మెర కళ్యాణ్ గౌడ్, ఉస్మాన్, కాంచనపల్లి వనజారాణి, కుంట రాజు, పీరని ప్రవీణ్, రఫీ, శేఖర్, నర్సింహుల రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మూలనపడి మూలుగుతున్న

# వైకుంఠ రథం




- పట్టించుకోని పంచాయతీ అధికారులు, పాలకులు
- లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా
- ప్రైవేటు వాహనాలతో ప్రజలకు ఆర్థిక భారం
- త్వరగా మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని గ్రామస్తుల డిమాండ్

కాకతీయ, రాయపర్తి : ప్రజల అత్యవసర సేవలకు, అంతిమయాత్రలకు ఉపయోగపడాల్సిన 'వైకుంఠ రథం' పంచాయతీ అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో మూలనపడి మూలుగుతోంది. లక్షలాది రూపాయల ప్రజాధనంతో కొనుగోలు చేసిన వాహనం చాలాకాలంగా వినియోగంలో లేకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాయపర్తి గ్రామ ప్రజల అవసరాల కోసం సమకూర్చిన వాహనం సేవలకు దూరంగా ఉండటంతో అత్యవసర సమయాల్లో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనంపై ఫోన్ నంబర్లు స్పష్టంగా ఉన్నప్పటికీ, వాటికి ఫోన్ చేస్తే డ్రైవర్ అందుబాటులో లేడని, వాహనం మరమ్మతులో ఉందని పంచాయతీ అధికారులు చెబుతూ కాలయాపన చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం వైకుంఠ రథం ముళ్లకంపలు, పిచ్చిమొక్కల మధ్య ఉండటంతో ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ తుప్పుపడుతోందని పేర్కొంటున్నారు. ప్రజల అవసరాల కోసం కొనుగోలు చేసిన వాహనం ఇలా నిరుపయోగంగా ఉండటంతో ప్రజాధనం వృథా అవుతోందని విమర్శిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంతిమయాత్రకు వాహనం అవసరమైనప్పుడు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని, ఇందుకోసం వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి రావడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత గ్రామపంచాయతీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి వైకుంఠ రథానికి మరమ్మతులు చేయించి వెంటనే ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

### త్వరలోనే వినియోగంలోకి తెస్తాం

వైకుంఠ రథం వినియోగంపై పంచాయతీ కార్యదర్శి యాకూబ్ నాయక్ వివరణ ఇస్తూ.. వాహనానికి చిన్నపాటి సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్లే సేవలు నిలిచిపోయాయని తెలిపారు. త్వరలోనే మరమ్మతులు పూర్తి చేసి వాహనాన్ని పూర్తిస్థాయిలో ప్రజల వినియోగంలోకి తీసుకువస్తామని ఆయన పేర్కొన్నారు.

## నెల్లికుదురు ప్రజావాణి కి 14 దరఖాస్తులు



కాకతీయ,నెల్లికుదురు : ప్రజా సమస్యలు వేగంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వారం వారం మండల స్థాయిలో ప్రవేశపెట్టిన ప్రజావాణి కొనసాగుతోంది. మండల కేంద్రం నెల్లికుదురు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో సింగారపు కుమార్ తోపాటు 18 శాఖల అధికారులు పాల్గొని ప్రజలు తమ సమస్యలపై సమర్పించిన వినతులను స్వీకరించారు. అనంతరం ఎంపీడీవో కుమార్ దరఖాస్తుల వివరాలను వెల్లడించారు. ప్రజావాణి కి మండల వ్యాప్తంగా ప్రజలు తమ సమస్యలపై 14దరఖాస్తులు అందజేసినట్లు వెల్లడించారు.రెవెన్యూ సమస్యలపై 6 దరఖాస్తులు, హౌసింగ్ పై ఒక దరఖాస్తు, విద్యుత్ సంబంధిత సమస్యపై 2, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి పై 3 దరఖాస్తులు ,ఐసిడిఎస్ కు చెందిన సమస్యపై1,అగ్రికల్చర్ ప్రాబ్లమ్ పై ఒక దరఖాస్తుసంబంధిత బాధితుల నుంచి వచ్చినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. ప్రజావాణిలో పలు శాఖలకు చెందిన అధికారులు హాజరవుతున్న దృష్ట్యా సమస్యలు పరిష్కరించడానికి ఇది ఒక చక్కని వేదిక అని,మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి దృష్టికి తీసుకువచ్చి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పేదల మందులపై భారమెందుకు?

**పసరలో జనరిక్ మందుల షాపు ఏర్పాటు చేయాలి**

**బీజేపీ జిల్లా నాయకుడు కర్ర సాంబశివరెడ్డి**




కాకతీయ, ములుగు ప్రతినిధి: పసరలో జనరిక్ మందుల షాపు లేకపోవడంతో చుట్టుపక్కల 45 గ్రామాల పేద, మధ్యతరగతి ప్రజలు అధిక ధరలకు మందులు కొనుగోలు చేయాల్సి వస్తోందని బీజేపీ జిల్లా నాయకుడు కర్ర సాంబశివరెడ్డి అన్నారు. పసరలో గతంలో అందుబాటులో ఉన్న జనరిక్ మందుల షాపును తొలగించడంతో ప్రజలకు తక్కువ ధరలకు మందులు లభించడం లేద న్నారు. వైద్య అవసరాల కోసం వచ్చే పేదలు, మధ్యతరగతి కుటుంబాలపై మందుల ఖర్చు భారంగా మారుతోందని తెలిపారు. కొన్ని మెడికల్ షాపుల యాజమాన్యాల ఒత్తిళ్లతోనే జనరిక్ మందుల షాపును తొలగించారనే ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని పసరలో తొలగించిన జనరిక్ మం దుల షాపును వెంటనే పునరుద్ధరించాలని కోరారు. సాధ్యం కానిపక్షంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో కొత్త జనరిక్ మందుల కేంద్రాన్ని ఏర్పాటు చేసి తక్కువ ధరలకు మందులు అందుబాటులోకి తేవాలని కర్ర సాంబశివరెడ్డి డిమాండ్ చేశారు.

## ఆపద వేళ కొండంత అండగా సీఎంఆర్‌ఎఫ్

**పాలకుర్తి నియోజకవర్గంలో 262 మందికి రూ.1,05,54,100 చెక్కులు**

**పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి**



కాకతీయ,రాయపర్తి / పాలకుర్తి : నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఆపద సమయాల్లో కొండంత అండగా నిలుస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాలకు చెందిన 262 మంది లబ్ధిదారులకు రూ.1,05,54,100 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిరుపేద ప్రజలపై వైద్య ఖర్చుల భారం పడకుండా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది అప్పుల పాలవుతున్న బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా కొండంత భరోసా లభిస్తుందన్నారు. రూపాయి ఖర్చు లేకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి పేదవాడి ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పారదర్శకంగా చేరవేస్తామని అభయమిచ్చారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఖైదీలు, చిన్నారులకు న్యాయ సహాయంపై ప్రత్యేక దృష్టి

**మామునూరు ఓపెన్ ఎయిర్ జైలు, చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్‌లో తనిఖీ**

**డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి కందుకూరి పూజ**



కాకతీయ, వరంగల్ బ్యూరో : ఖైదీలు, చిన్నారులకు అందుతున్న న్యాయ సహాయం, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి కందుకూరి పూజ సూచించారు. సోమవారం మామునూరు ఓపెన్ ఎయిర్ జైలుతో పాటు న్యూ లైఫ్ సొసైటీ చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్‌ను ఆమె సందర్శించారు. ముందుగా జైలులోని న్యాయ సహాయ కేంద్రాన్ని పరిశీలించి ఖైదీలకు అందుతున్న ఉచిత న్యాయ సహాయ సేవలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బ్యారక్‌లు, వసతి ప్రదేశాలను పరిశీలించి ఖైదీలతో మాట్లాడారు. వారి కేసుల స్థితిగతులు, న్యాయపరమైన సమస్యలు, అవసరమైన సహాయం గురించి ఆరా తీశారు. అనంతరం న్యూ లైఫ్ సొసైటీ చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్‌లో చిన్నారులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. చిన్నారులు నివసించే గదులను సందర్శించి వసతి, పరిశుభ్రత, భద్రత, ప్రాథమిక సౌకర్యాలను తనిఖీ చేశారు. చిన్నారులకు అవసరమైన అన్ని సౌకర్యాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. జైలు సూపరింటెండెంట్ కళా సాగర్, జైలర్లు పూర్ణచందర్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సెల్ పి. శ్రీనివాసరావు, న్యూ లైఫ్ సొసైటీ నిర్వాహకురాలు తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

- నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం
- సిబ్బంది సమయపాలన పాటించాలి
- డీఎంహెచ్ఓ డా. బి. రాజారెడ్డి ఆదేశం



కాకతీయ, వరంగల్ ప్రతినిధి: దుగ్గొండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. బి. రాజారెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని రికార్డులు, రిజిస్టర్లు, ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, అన్ని ఆరోగ్య కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయాలని సూచించారు. సిబ్బంది నిర్ణీత సమయానికి విధులకు హాజరై సమయపాలన పాటించాలని ఆదేశించారు. రికార్డులు, రిజిస్టర్లను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డా. సజిదా, వైద్యాధికారులు కిరణ్‌కుమార్, డా. రాకేష్, సిబ్బంది పాల్గొన్నారు.